క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కృష్ణమూర్తి



రణస్థలం: ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను తన క్యాంపు కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు రామారావు, అల్లు లక్ష్మీనారాయణ ఉన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు అభినందనలు

గార: డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన గొండు కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. శనివారం వారి స్వగృహంలో మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కంటిపాక హిమశేఖర్, బూత్ కన్వీనర్ గుజ్జల రామారావు, మురపాక సన్యాసిరావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీరఘట్టం చిన్నారావు, భూలోకం తదితరులున్నారు.

సమావేశంలో సమస్యలపై చర్చ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని, ఆర్‌బీకేల్లో ఖరీఫ్‌కు సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సభ్యులు ప్రస్తావించారు. సభ్యుల ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇచ్చారు. ఎంపీపీ చిరంజీవి, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

'సర్పంచ్‌ల చలో ఢిల్లీని విజయవంతం చేయండి'

శ్రీకాకుళం రూరల్: సర్పంచ్‌ల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 2న ఏపీ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు అన్ని పార్టీలకు చెందిన 100 మంది సర్పంచ్‌లు ఢిల్లీ వెళ్తారని తెలిపారు.


రేషన్‌కార్డులు అందజేత



రేషన్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

లావేరు: చినకొత్తకోట గ్రామానికి చెందిన పలువురికి కొత్తగా రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు కొత్తకోట ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుమ్మడి దుర్గారావు శనివారం పంపిణీ చేశారు. వీఆర్వో రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకుడు లుట్ల ఎల్లయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు



కోతకు గురైన రోడ్డు

లావేరు: ఇటీవల కురిసిన వర్షాలకు ఆరంగిపేట కొండ సమీపంలో బీటీ రోడ్డు కోతకు గురైంది. లావేరు, ఎచ్చెర్ల మండలాల్లోని 20 గ్రామాలకు చెందిన వారు దీనిపైనే ప్రయాణాలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లావేటిపేటలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేటిపేట గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. కాలువల్లో పూడికలను తొలగించి డంపింగ్ యార్డుకు ట్రాక్టర్‌లో తరలించారు. సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పనులను పర్యవేక్షించారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీవో శోభాదేవి అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని చెరువుగట్లపై, రహదారికి ఇరువైపులా నాటుతున్న మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.

సాగునీరు సక్రమంగా ఇవ్వండి

- జి.సిగడాం మండల సమావేశంలో సభ్యుల విజ్ఞప్తి



ఎంపీ చంద్రశేఖర్ సమక్షంలో సమస్యలను ప్రస్తావిస్తున్న సభ్యులు

జి.సిగడాం: తోటపల్లి, మడ్డువలస కాలువల ద్వారా మండలంలోని ఆయకట్టుకు సక్రమంగా సాగునీటిని సరఫరా చేయాలని సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షత శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో తోటపల్లి, మడ్డువలస కాలువల ద్వారా సాగునీరు అందక రైతులంతా నానా ఇబ్బందులు పడ్డారని సభ దృష్టికి తెచ్చారు. ఈ ఏడాదైన సక్రమంగా కాలువల ద్వారా నీరు వస్తుందా.. లేదా అని సంబంధిత అధికారులను వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మక్క శ్రీలత, గేదెల వరలక్ష్మి, పెద్ది శ్రీనివాసరావు ప్రశ్నించారు. దీనిపై మడ్డువలస రిజర్వాయర్ ఏఈఈ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి 20 కోట్ల రూపాయలు విడుదల చేశారని కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గెడ్డకంచరాం గ్రామంలో మంచినీటి ట్యాంకు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ పంచిరెడ్డి శ్యామలరావు అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా అన్ని పంచాయతీలకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారని.. అయితే ముందుగా నీరు నిల్వ చేసే ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని సభ్యులు కోరారు.

చిన్నచిన్న సమస్యలు కూడా..

అధికారుల దృష్టికి చిన్నచిన్న సమస్యలను తీసుకెళ్తున్నా పరిష్కారం చేయడం లేదని సభ్యులు అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమాచారం సభ్యులకు తెలియజేయడం లేదని సర్పంచులు సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, భూపతి సురేషకుమార్, దారబోయిన రెయిమ్మ, గౌరవ సభ్యులు కుదిరెల్ల సుజాత, తిరుమరెడ్డి విజయలక్ష్మి సభ దృష్టికి తీసుకువచ్చారు. మధుపాం గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టు మంజూరైన ఇంతవరకు ఎందుకు నియమించలేదని సభ్యుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాకపోతే ఎలా అని సర్పంచ్ బగాది అప్పలనాయుడు, అల్లు జోగినాయుడు, మహదాస్యం చిన్నారావు, తిరుమరెడ్డి వెంకటరావు అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ మీసాల సత్యవతి, ఎంపీడీవో నిశ్చల సమాధానమిస్తూ ప్రభుత్వం పక్కా భవనాలు మంజూరు చేసిందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు.

అభివృద్ధిపై ఎంపీ చంద్రశేఖర్ సమీక్ష

జి.సిగడాం మండలంలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సమీక్షించారు. విద్య, వైద్య నీరు పారుదల, గృహ నిర్మాణం, విద్యుత్, పౌర సరఫరా, రోడ్లు, భవనాలు, ఐసీడీఎస్‌లపై చర్చించారు. పాలఖండ్యాం -మెట్టవలస ప్రధాన రహదారిలో నీరు నిల్వ ఉండిపోవడంతో రోడ్డు పాడవుతోందని.. సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ ధారబోయిన ధర్మారాజ్ ఎంపీకి విన్నవించుకున్నారు. సంతవురిటి నుంచి సీతారాంపురం వరకు రహదారి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైద్యాధికారిణి పొన్నాడ హరితాశ్రీ, ఏఈఈలు ఎం.రమేష్, బగాది భాగ్యలక్ష్మి, జి.తిరుపతిరావు, మండల విద్యాశాఖ అధికారి అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల విద్యుత్‌శాఖ ఏఈఈ జి.తిరుపతిరావు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ మీసాల సత్యవతి తదితరులు కూడా ఏఈఈ బాగా పని చేస్తున్నారన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



కాలువను పరిశీలిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్పొరేషన్ పరిధి 38వ డివిజన్ దమ్మలవీధిలో డ్రైనేజీ సమస్య చాలాకాలంగా ఉంది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు దీంతో ఆయన శనివారం దమ్మలవీధిలో పర్యటించారు. కాలువ సమస్యను నేరుగా పరిశీలించి శానిటేషన్ ఇన్‌చార్జి గణేష్ సమక్షంలో పరిష్కరించేందుకు కావాల్సిన నిధులు కేటాయించాలని చెప్పారు. స్థానిక ప్రజలతో మమేకమై, సమస్యను నేరుగా తెలుసుకొని, పర్యవేక్షించి సమస్యను పరిష్కరించారు. ఈయన వెంట భయ్యా, విజయమ్మ, కన్నబాబు, శ్రీను, లత, అర్జున్, ఉదయ్ ఉన్నారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: సమతుల్యతతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని పలువురు వైద్యులు అన్నారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం విశాఖ-బీ కాలనీలోని షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు అన్నారు. క్లబ్ అధ్యక్షుడు వై.మురళీమోహనరావు, చిన్న పిల్లల వైద్య నిపుణులు కొంచాడ సోమేశ్వరరావు, కిల్లంశెట్టి దిలీప్, దంత వైద్యుడు మధువిలేకర్ పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- ఎచ్చెర్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను చేరువ చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డు వారీగా లబ్ధిదారులకు వర్తించిన సంక్షేమ పథకాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ఒకవర్గానికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందజేసేవారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు సేవలను ఉచితంగా లబ్ధిదారులకు అందజేశామన్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, కార్పొరేషన్ డైరెక్టర్లు నక్క కృష్ణమూర్తి, కేవీవీ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ రాజేంద్ర ప్రసాద్, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శోభాదేవి, స్థానిక నాయకులు నేతింటి సత్యనారాయణ, మెండ లక్ష్మీనారాయణ, సూరపు శివ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న దృశ్యం

గార: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని అంపోలు నుంచి తూలుగు వరకు తంపర భూముల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నీటిలో ఉన్న వరి పొలాలను రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, ఎంపీపీ గొండు రఘురామ్, ఏడీఏ బగ్గు రజనీ శనివారం పరిశీలించారు. అంపోలు వద్ద గల పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీరు పూర్తిగా తగ్గితే వరి పంట పరిస్థితి తెలుస్తుందని, అప్పుడు పూర్తిస్థాయిలో నష్టంపై అంచనా వేయగలమని ఏడీఏ రజనీ అన్నారు. ప్రాథమికంగా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. ఇప్పటికీ కిందిస్థాయికి నీరు తక్కువ మోతాదులోవెళ్తున్నట్టు గుర్తించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు జయరాం, ఏవో డి.పద్మావతి, శ్రీనివాసరావు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

శ్రీకాకుళం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీకాకుళం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షత శనివారం జరిగింది. వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ మండలంలో 5,500 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నట్టు చెప్పారు. కిసాన్ డ్రోన్స్ మూడు గ్రూపులకు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే ఎనిమిది రకాల విత్తనాలు, 230 టన్నులు యూరియా ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ.. ఎక్కడైనా లోఓల్టేజ్ సమస్య ఉంటే తమను సంప్రదించాలన్నారు. వాకలవలస నుంచి కొత్తరోడ్ వరకూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని.. దీంతో స్తంభాలు వంగిపోయి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వాకలవలస సర్పంచ్ బగాది మనోజ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. జగనన్న హౌసింగ్ కాలనీకి సంబంధించి 204 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సంబంధిత అధికారి తెలిపారు. సమావేశం మధ్యలో పలువురు విపక్ష సభ్యులు కలుగజేసుకొని సమావేశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అడ్డుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఎంపీడీవో ఆర్.రామ్మోహన్ పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జెండాలవీధిలో మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు శనివారం నిర్వహించారు. ముందురోజు అలంకరించి పూజలు చేసిన పీర్లను ఊరేగింపుగా నాగావళి నది ఒడ్డుకు తీసుకుకెళ్లి పరిశుభ్రం చేసి తిరిగి వాటిని దర్గాలో ఉంచారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పరామర్శలో పార్టీ నాయకులు

జి.సిగడాం: ఎందువ గ్రామానికి చెందిన కింజరాపు జగన్‌మోహన్ ఇటీవల గాయపడ్డారు. ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు కంది ఈశ్వరరావు, అబోతుల జగన్నాథం, నక్క శశిభూషణనాయుడు శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థిని ప్రతిభ



ప్రత్యూషను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎ.ప్రత్యూష మల్టీ నేషనల్ సంస్థ ఈవై కంపెనీలో రూ.13.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికై ందని ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యూషను శనివారం కళాశాలలో అభినందించారు.

నేడు అభ్యుదయ రచయితల సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 30వ తేదీన అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై కవులు, రచయితల స్పందన కోసం సమావేశం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షులు, కార్యదర్శి నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని క్రాంతి భవన్‌లో ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో కవిత, పాటలు, మాటలు రూపంలో వారి స్పందనలు తెలియజేయవచ్చునన్నారు.

సంస్కృత భాషను నేర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సంస్కృత భాష తల్లి వంటిందని.. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక అనురాగ నిలయంలో బాలకథానిలయం, సంస్కృతి భారతి ఆధ్వర్యంలో 'సంస్కృత వదతు (మాట్లాడడండి) అనే కార్యక్రమం శనివారం నిర్వహించారు. సంస్కృత భాషా సంఘం జిల్లా అధ్యక్షుడు బూర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో పూజలు

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక భజన బృందం వారు అన్నమయ్య కీర్తనలు అలరించారు.

బీజేపీలో చేరిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలో ఉన్న తమైన కుటుంబానికి చెందిన గొలివి కరుణాకరరావు బీజేపీలో చేరారు. శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఈ-లైబ్రరీ కన్వీనర్ చల్లా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి గంగు శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజలకు జగనన్న సు'రక్ష'

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: కోష్ట గ్రామమంలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నెల రోజులపాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామరక్షగా ఉపయోగపడిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కోష్ట గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలనే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే 11 రకాల సేవలు అందించడం జరిగిందన్నారు. సీఎం జగన్ నెలకొల్పిన వలంటీర్లు పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే పచ్చ నాయకులు, దత్తపుత్రుడు కలిసి లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. అదే వలంటీర్లు రానున్న 2024 ఎన్నికల్లో జగనన్నకు వెన్నుదన్నుగా నిలిచి అఖండ మెజారిటీతో గెలిపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, మహిళ అధ్యక్షురాలు గురాన మానస, కోష్ట సర్పంచ్ పిషిని చిన్నంనాయుడు, గ్రామ నాయకులు పిషిణి లక్ష్మణరావు, పెంటంనాయుడు, పల్లె లక్ష్మణ, కిరణ్ యువసేన అధ్యక్షుడు చిన్నంనాయుడు ఉన్నారు.



వెల్పురాయిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న సాయికుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రణస్థలం: పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. వెల్పురాయి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్ష ద్వారా 11 సేవలను సత్వరమే అందించడం జరిగిందన్నారు. మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మైలపల్లి కామరాజు, చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, గ్రామ నాయకులు మీసాల శ్రీనివాసరావు, మీసాల రామునాయుడు, గురాన ప్రసాద్, కెల్ల రామకృష్ణ, యలకల అయ్యప్పలనాయుడు, కృష్ణారావు ఉన్నారు.

జగనన్న సురక్ష విజయవంతంపై హర్షం

జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో విజయవంతం కావడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా 95 శాతం సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని.. మిగిలిన ఐదు శాతం కూడా పూర్తి చేసి శతశాతం ప్రజల్లో సంతృప్తి వ్యక్తం చేసేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల్లో ఎక్కడా ముఖ్యమంత్రిపై వ్యతిరేకత లేకపోవడం, ప్రజా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు వలంటీర్ల ద్వారా చేరుతుండడాన్ని చూసి ఒర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నాయకుల బూటకపు మాటలు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. జగనన్న సురక్షణ కార్యక్రమం విజయంతానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మైలపల్లి కామరాజు, చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, మహంతి సత్యనారాయణ, దన్నాన సత్యంనాయుడు ఉన్నారు.